క్లుప్తంగా

ఏకగ్రీవంగా వాకర్స్‌క్లబ్ నూతన కార్యవర్గం



మధురానగర్(విజయవాడసెంట్రల్): దుర్గాపురం వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఆదివారం ఏకగ్రీవం అయ్యింది. స్థానిక దుర్గాపురంలో వాకర్స్ క్లబ్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా క్లబ్ నూతన అధ్యక్షుడిగా షేక్ బాబు, ఉపాధ్యక్షుడిగా దొడ్డా ఆంజనేయప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా నూలు సత్యనారాయణ, కోశాధికారిగా ఎంవీ కృష్ణారావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యుల చేత నాయకుడు కొల్లూరి ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన కమిటీ రెండేళ్లపాటు పదవీకాలంలో ఉంటుంది. వాకర్స్‌కు మరింత మెరుగైన సేవలు అందిస్తామని ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సభ్యులు వీరమాచనేని కిషోర్, నవనీతం సాంబశివరావు, మాజీ అధ్యక్షుడు బొప్పన గాంధీ తదితరులు పాల్గొన్నారు.

ముర్రాట్ ఉత్సవాల కరపత్రాల ఆవిష్కరణ



మధురానగర్(విజయవాడసెంట్రల్): దావుబుచ్చయ్యకాలనీ శ్రీ శ్యామలాంబదేవి ఆలయంలో ఈనెల ఎనిమిదో తేదీ మంగళవారం నిర్వహించనున్న ముర్రాట్ ఉత్సవాల కరపత్రాలను ఆదివారం ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలని ఆకాంక్షించారు. పండుగలను కలిసిమెలసి జరుపుకోవాలని సూచించారు. ఆలయ ధర్మకర్త చింతపల్లి కనకారావు మాట్లాడుతూ ఎనిమిదో తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు ముర్రాట్‌లతో మేళతాళాలు, డప్పు వాయిద్యాలతో అమ్మవారి ఉత్సవమూర్తి ఊరేగింపు కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. భక్తులు ముర్రాట్‌ల ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అవధాన సరస్వతికి పద్యనీరాజనం



విజయవాడ కల్చరల్: పలకరిస్తే పద్యం, సమస్య చెపితే పద్యం, అప్రస్తుత ప్రసంగం చేస్తే పద్యం. అవధాని తాతా సందీప్‌శర్మ మూడు గంటలపాటు నిర్వహించిన అష్టావధానం సాహితీ పరిమళాలు వెదజల్లింది. శ్రీ సద్గురు సంగీత సభ ఆధ్వర్యంలో శరన్నవరాత్రుల కార్యక్రమంలో భాగంగా ఆదివారం శివరామకృష్ణ క్షేత్రంలో నిర్వహించిన అవధానం పండితులతో పాటు అభిమానులను ఆకట్టుకుంది. విద్యావేత్త, మల్లాప్రగడ శ్రీమన్నారాయణ సంచాలకత్వంతో అవధాని తాతా సందీప్‌శర్మ అష్టావధాన కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించారు.

నల్లాన్ చక్రవర్తుల సాహిత్(నిషిద్ధాక్షరి), డాక్టర్ కానుకొల్లు బాలకృష్ణ(సమస్య), కావూరి సత్యవతి(దత్తపది), డాక్టర్ ధూళిపాళ రామకృష్ణ(వర్ణన), మల్లాప్రగడ నందకిషోర్(వ్యస్తాక్షరి), పంతుల గాయత్రి(ఆశువు), పంతుల తపస్వి(అప్రస్తుత ప్రసంగం) అంశాలపై అవధానికి ప్రశ్నలు సంధించగా వాటికి పద్యరూపంలో సమాధానమిచ్చి సంతృప్తి పరిచారు. కార్యక్రమంలో సద్గురు సంగీత సభ కార్యదర్శి గౌరీనాథ్, అధ్యక్షుడు ప్రసాద్ పాల్గొన్నారు. అవధానిని నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

మొన్న వరద.. నేడు మురుగు

- మ్యాన్‌హోల్స్ నుంచి రోడ్లపైకి పొంగి ఇళ్లల్లోకి వస్తున్న మురుగు
- కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న అండర్ గ్రౌండ్ డ్రెయినేజీలు
- దోమలు, దుర్వాసన, రోగాలతో అల్లాడిపోతున్న స్థానిక ప్రజలు
- ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



భారతమాత మందిరం రోడ్డు గ్యాస్‌గోడౌన్ ఎదురు రోడ్డులో పొంగి పొర్లుతున్న మ్యాన్‌హోల్



నందమూరినగర్‌లో మ్యాన్‌హోల్ నుంచి వస్తున్న మురుగు



న్యూఆర్ఆర్‌పేటలో ఇళ్ల ముందు మ్యాన్‌హోల్

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ పరిసర ప్రాంతాల్లో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీలు స్థానిక ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఎక్కడ చూసినా యూజీడీ మ్యాన్‌హోల్స్ పొంగిపొర్లుతుండటంతో వాటిలో నుంచి మురుగునీరు, వ్యర్థాలు బయటకు వచ్చి చుట్టుపక్క ప్రాంతాల ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. అసలే మొన్నటి భారీ వర్షాలు, బుడమేరు వరద ముంపులో చిక్కుకొని అల్లాడిపోయి ఉంటే ఇప్పుడు వాటికి తోడు మురుగు కంపు తోడై తమ ప్రాణాలు తోడేస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అన్ని ప్రాంతాల్లో ఇదే దుస్థితి

సింగ్‌నగర్, నందమూరినగర్, న్యూరాజరాజేశ్వరీపేట, తోటవారివీధి, భారతమాత మందిరం రోడ్డు, ఆంధ్రప్రభకాలనీ, వాంబేకాలనీ, పీఅండ్‌టీ కాలనీ, కృష్ణాహోటల్ సెంటర్ పరిసర ప్రాంతాల్లో ఎక్కడ చూసినా యూజీడీ మ్యాన్‌హోల్స్ నిండిపోయాయి. ప్రధానంగా బుడమేరు వరద తర్వాత ఈ సమస్య మరింత తీవ్రంగా మారింది. ఏ వీధికి వెళ్లినా.. ఎక్కడ చూసినా మ్యాన్‌హోల్ నుంచి తీవ్ర దుర్వాసనలతో కూడిన మురుగునీరు.. వ్యర్థాలు పొంగి పొర్లుతుండటంతో స్థానిక ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. సంబంధిత అధికారులకు, సిబ్బందికి ఎన్నిసార్లు చెప్పినా ఒక్కరు కూడా పట్టించుకోవడం లేదని, అదేమని గట్టిగా అడిగితే వెహికల్స్ లేవు పాడైపోయాయని చెప్పుకొస్తున్నారు తప్ప తమ సమస్యలను మాత్రం పరిష్కరించడం లేదని వాపోతున్నారు.

రోడ్లపైనే నిలిచిపోతున్న మురుగునీరు

న్యూరాజరాజేశ్వరీపేట, సింగ్‌నగర్ పరిసర ప్రాంతాల్లో చిన్న చిన్న రోడ్లలో ఉన్న మ్యాన్‌హోల్స్ నుంచి మురుగు, వ్యర్థాలు బయటకు వచ్చి ఆ రోడ్లపైనే నిలిచిపోవడం, కొన్నిచోట్ల ఇళ్లల్లోకి కూడా వచ్చేస్తున్నాయి. దీంతో స్థానిక ప్రజలు రాకపోకలు సాగించేందుకు, ఇంటి పనులు చేసుకునేందుకు వేరే మార్గం లేకపోవడంతో వాటి మధ్యలోనే అవస్థలు పడుతూ ఉండాల్సి వస్తుంది. నందమూరినగర్, తోటవారివీధి, భరతమాత మందిరం రోడ్డులోని గ్యాస్ గోడౌన్ ఎదురు రోడ్లలో మ్యాన్‌హోల్స్ పరిస్థితి దారుణంగా తయారైంది. వీటి నుంచి వస్తున్న దుర్వాసనలు, దోమలతో ఇళ్లల్లో అస్సలు ఉండలేకపోతున్నామని స్థానికులు చెబుతున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు ఇప్పటికైనా యూజీడీ సమస్యలతో బాధపడుతున్న తమ ప్రాంతాలను సందర్శించి, వాటి నుంచి తమకు విముక్తి కలిగించాలని కోరుతున్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రపంచ సెరిబ్రల్ పాల్సీడే పురస్కరించుకుని అయోధ్యనగర్ లోటస్ ల్యాండ్‌మార్క్‌లోని చేయూత మానసిక వికలాంగుల శిక్షణ సంస్థ కార్యాలయంలో ఉచిత వైద్యశిబిరం, ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ టి. కృష్ణకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఉచిత వైద్య శిబిరం జరుగుతుందన్నారు. ప్రముఖ వైద్యుడు డాక్టర్ బి.వి. గురునాథ్ శర్మ ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేస్తారని తెలిపారు. అలాగే చిన్నారులకు వాకింగ్, బాల్‌గేమ్, చిత్రలేఖనంలో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

విద్యార్థులకు కూచిపూడి నాట్య శిక్షణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గవర్నర్‌పేటలోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం' కార్యక్రమం ఆదివారం జరిగింది. ఇందులో భాగంగా విద్యార్థులతో నీతి కథలు, ప్రముఖుల జీవిత చరిత్రలు.. ఇతర పుస్తకాలు చదివించారు. ప్రతి ఆదివారం నిర్వహించే చదవడం మాకిష్టం కార్యక్రమంలో విద్యార్థులు ఉల్లాసంగా పాల్గొన్నారు. అనంతరం సరస్వతీ సామ్రాజ్యం వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా కూచిపూడి నాట్య శిక్షణ ఇచ్చారు. నృత్య శిక్షకురాలు జ్యోత్స్న కూచిపూడిలో మెలుకువలు నేర్పించారు. విద్యార్థులు నృత్య రీతులను సాధన చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కె. రమాదేవి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీలలితా త్రిపుర సుందరీదేవి నమోస్తుతే..



శివరామకృష్ణ క్షేత్రంలో లలితాత్రిపుర సుందరీదేవి



చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో..



దుర్గాపురంలో లలితా త్రిపుర సుందరీదేవి



శ్రీ అంకమ్మతల్లి శక్తిపీటంలో..



శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో ధాన్యలక్ష్మి అవతారం



ఆంధ్రప్రభకాలనీలో శ్రీలలితా త్రిపుర సుందరీదేవిగా అమ్మవారు

విజయవాడ కల్చరల్: నగరంలో శరన్నవరాత్రులు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. శృంగేరీ శారదాపీఠం జగద్గురులు భారతీ తీర్థ మహాస్వామి ఆదేశంతో పీఠ సంప్రదాయాన్ని అనుసరించి శివరామకృష్ణ క్షేత్రంలో ఆదివారం ముగ్గురమ్మలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కౌమారి, శ్రీలలితా త్రిపుర సుందరి, గజలక్ష్ములు పూజలందుకున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ధర్మాధికారి శిష్టా హనుమత్ ప్రసాద్ పర్యవేక్షణలో ఆదిశంకరులకు ప్రత్యేక పూజలు చేశారు. లబ్బీపేట శ్రీ శారదా చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో శారదా మాతకు శ్రీ లలితా త్రిపుర సుందరీదేవి అలంకరణలో పూజలు నిర్వహించారు. ఇదే ప్రాంగణంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహోత్సవాల్లో భాగంగా నిత్యహోమం, బలిహరణం, సప్తర్షి పూజ నిర్వహించారు. మేనేజర్ శర్మ, ట్రస్టీ బోర్డ్ చైర్మన్ మాగంటి వేణుగోపాల్ పాల్గొన్నారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో ఆదివారం శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని శ్రీధర్మపరిషత్ మహాసంస్థానం ఆధ్వర్యాన ధాన్యలక్ష్మీదేవిగా అలంకారం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రైతుల, ప్రజలు పాడిపంటలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలంటూ పీఠం వ్యవస్థాపకులు అవ్వా హేమసుందర వరప్రసాద్ చేతులమీదుగా మహాలక్ష్మి హోమం, లక్ష్మీగణపతి, రుద్రహోమం, ఛండీ హోమం శాస్త్రోక్తంగా చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో కుంకుమార్చనలు నిర్వహించారు. ముత్యాలంపాడు శ్రీ పార్వతీసమేత రామలింగేశ్వర స్వామివారి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా పూజలు అందుకున్నారు. రామలింగేశ్వరపేట శ్రీప్రసన్నాంజనేయ స్వామివారి దేవాలయంలో అమ్మవారిని శ్రీగాయత్రీదేవిగా అలంకరించి పూజలు చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు తాన్న పూర్ణచంద్రరావు, దుర్గారావు పర్యవేక్షించారు. మధురానగర్ మెయిన్‌రోడ్డులో ఆదివారం సాయంత్రం నవరాత్రి ఉత్సవాల్లో ఎమ్మెల్యే బొండా ఉమా పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం లాటరీ తీసి భక్తులకు చీరలు అందజేశారు. ప్రతి ఏటా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులను అభినందించారు.

దుర్గాపురంలో...

దుర్గాపురంలో వీరమాచనేని కిషోర్ ఆధ్వర్యాన శ్రీదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని శ్రీలలితా త్రిపుర సుందరీదేవిగా అలంకారం చేసి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వీరమాచనేని లలిత ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. మధురానగర్ మెయిన్ రోడ్డు, మధురానగర్ నేతాజీ కాలనీ శ్రీ అంకమ్మతల్లి శక్తిపీఠంలో అమ్మవారిని మహాలక్ష్మీదేవిగా అలంకారం చేసి పూజలు చేశారు. సామూహిక కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు జరిగాయి. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకుడు అన్నాబత్తుల శరాబందీరావు పర్యవేక్షించారు.

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం సింగ్‌నగర్, న్యూరాజరాజేశ్వరీపేట, ఆంధ్రప్రభకాలనీ, వాంబేకాలనీ, పీఅండ్‌టీ కాలనీ పరిసర ప్రాంతాల్లోని అమ్మవారి ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. సింగ్‌నగర్ ఆంధ్రప్రభకాలనీలోని శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో వేంచేసి ఉన్న శ్రీకాశీ అన్నపూర్ణ దేవి ఆలయంలో అమ్మవారు శ్రీలలితా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీ సాయి ప్రభ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో భక్తులను తీర్థప్రసాదాలు అందజేశారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు



కార్తీక గాత్ర కచేరి

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. నాట్యాచారిణి శారద రామకృష్ణ శిష్య బృందం చేసిన ప్రదర్శనలు ఆద్యంతం చూపరులను భక్తి తన్మయత్వంలో ముంచెత్తాయి. భక్తి కీర్తనలకు అనుగుణంగా చిన్నారులు చేసిన నృత్యాలు రంజింపజేశాయి. అలాగే కార్తీక గాత్ర కచేరి భక్తులను ఆకట్టుకుంది. పెద్ద సంఖ్యలో భక్తులు సాంస్కృతిక ప్రదర్శనలను తిలకించారు. కళాకారులకు పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమాలను శ్రీధర్మపరిషత్ మహాసంస్థానం ఉపాధ్యక్షుడు జయప్రకాష్, కోశాధికారి అడవికొలను వేణుగోపాలరావు పర్యవేక్షించారు.

ముత్యాలంపాడులో..

ముత్యాలంపాడు షిర్డీ సాయిబాబా మందిరంలో సాయినాథుని పుణ్యతిథి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం నూక ఉషామాధవి శిష్యబృందం చేసిన కూచిపూడి నృత్యాలు ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేశాయి. చిన్నారుల ప్రదర్శనలు ఆహుతులను రంజింప చేశాయి. చిన్నారులకు మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి జ్ఞాపికలను అందజేసి ప్రోత్సహించారు. కార్యక్రమాలను మందిర కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి పర్యవేక్షించారు.

డాక్టర్ వసంతకుమార్‌కు గోల్డ్ డోనర్ సభ్యత్వం



డాక్టర్ వసంతకుమార్‌ను సత్కరిస్తున్న వాకర్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ రామకృష్ణ తదితరులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): దుర్గాపురానికి చెందిన వాకర్స్ క్లబ్ డెప్యూటీ గవర్నర్, బీఆర్‌టీఎస్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు, దుర్గాపురం వాకర్స్ క్లబ్ జీవితకాల సభ్యుడు డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్‌కు వాకర్స్ ఫౌండేషన్ ట్రస్ట్ ఎంజీఎఫ్ గోల్డ్ డోనర్ సభ్యత్వం లభించింది. ఈ సందర్భంగా ఆదివారం క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ చిన్నం రామకృష్ణ చేతులమీదుగా ఘనంగా సత్కరించారు. రామకృష్ణ మాట్లాడుతూ అతితక్కువ సభ్యులతో బీఆర్‌టీఎస్ వాకర్స్ క్లబ్ ఎక్కువ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని అభినందించారు. ఇంటర్నేషనల్ వాకర్స్‌క్లబ్ నియమాల మేరకు పనిచేస్తున్నారని కొనియాడారు. ఇదే స్ఫూర్తితో అన్ని క్లబ్‌లు పనిచేయాలని సూచించారు. ఇంటర్నేషనల్ వాకర్స్ ఆధ్వర్యాన పనిచేస్తున్న ట్రస్టికి యాభై వేల రూపాయలను అందజేసి గోల్డ్ డోనర్ అయిన వసంతకుమార్‌ను ప్రతిఒక్కరూ స్ఫూర్తిగా తీసుకుని సేవా కార్యక్రమాలు చేయాలని సూచించారు. బీ వసంత కుమార్ మాట్లాడుతూ జీవితకాలం ముగిసిన తర్వాత కూడా ట్రస్ట్ ద్వారా వచ్చే వడ్డీతో దేశంలో ఏదైనా ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు సేవా కార్యక్రమాలకు ఉపయోగించడం జరుగుతుందన్నారు. తద్వారా పరోక్షంగా దేశానికి సేవ చేసే అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌టీఎస్ వాకర్స్‌క్లబ్ కార్యదర్శి కొండయగుంట రాము, కోశాధికారి గుర్రం ఏడుకొండలు, సభ్యుడు వీరంకి గోకర్ణేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యుత్ టవర్ల నిర్మాణ పనులు అడ్డగింత



రైతులతో వాగ్వాదం చేస్తున్న కాంట్రాక్ట్ సిబ్బంది

నున్న(విజయవాడరూరల్): రైతులకు ముందుగా ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, నష్ట పరిహారం చెల్లించకుండా వరి పంట పొలాల్లో చేపట్టిన హైటెన్షన్ విద్యుత్ టవర్ల నిర్మాణ పనులను అడ్డుకున్నారు. నున్న గ్రామంలో 12 మంది రైతులకు చెందిన 20 ఎకరాల్లో నుంచి విద్యుత్ హైటెన్షన్ టవర్ల నిర్మాణం చేపడుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం నున్న గ్రామానికి చెందిన మల్లికార్జునరెడ్డి అనే రైతు ఆర్‌ఎస్ నెంబరు 546/3 లోని ఎకరం 30 సెంట్ల వరి పంట పొలంలో విద్యుత్ టవర్లను నిర్మించే పనులు చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న రైతు మల్లికార్జునరెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు, గ్రామంలోని కొందరు రైతులు అక్కడకు వచ్చి తమకు నష్టపరిహారం చెల్లించకుండా పనులు చేయవద్దని సూచించారు. మీకు సమాధానం చెప్పాల్సిన పని లేదని కాంట్రాక్ట్ సంస్థ ఉద్యోగులు విద్యుత్ టవర్ల నిర్మాణం పనులు చేయడాన్ని రైతులు అడ్డుకున్నారు. నెల రోజుల్లో వరి పంట కోతకు వస్తుందని ఆ పంటను నాశనం చేస్తూ టవర్లను నిర్మిస్తే ఊరుకొనేది లేదని హెచ్చరించారు. ఈ పొలం మీదేనని రెవెన్యూ ఉద్యోగుల నుంచి క్లియరెన్స్ తీసుకురావాలని పనులు చేసే సిబ్బంది సూచించారు. రైతులు రెవెన్యూ అధికారులతో ఫోనులో మాట్లాడగా తమ నుంచి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని చెప్పారు. దీంతో రైతులు పనులు చేయవద్దని అడ్డుకున్నారు. ఏపీ ట్రాన్స్‌కో, ల్యాంకో విద్యుత్ హైటెన్షన్ లైన్లకు సంబంధించి ఫ్లైఓవర్ వద్ద ఎత్తు పెంచుతూ టవర్లను నిర్మిస్తున్నట్లు సిబ్బంది తెలిపారు. ఈ విషయంలో రైతులు నష్టపరిహారం చెల్లించకుండా పనులు ప్రారంభించవద్దని చెప్పడంతో సిబ్బంది చేసేది లేక పనులు ఆపివేసి వెనక్కి వెళ్లారు. రైతులు మల్లికార్జునరెడ్డి దంపతులు, బాలశేఖర్‌రెడ్డి, బొంతు సాంబిరెడ్డి, కండ్రిక సొసైటీ మాజీ చైర్మన్ ఎం.రవీంద్రరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, నాగిరెడ్డి తదితరులున్నారు.

ఘనంగా సాయినాథుని పుణ్యతిథి మహోత్సవాలు



సాయినాథ నవగ్రహ హోమం చేస్తున్న డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి దంపతులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో సాయినాథుని పుణ్యతిథి మహోత్సవాలు ఆదివారం నాలుగో రోజుకు చేరుకున్నాయి. పుణ్యతిథి మహోత్సవాల్లో భాగంగా సాయినాథునికి క్షీరము, తేనెతో అభిషేకం నిర్వహించారు. లోక కల్యాణార్థం సాయినాథ, నవగ్రహ హోమం వేదపండితులచే జరిగింది. కార్యక్రమంలో మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను మందిర కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి పర్యవేక్షించారు. అలాగే మధురానగర్ పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో ఆదివారం బాబావారికి ప్రత్యేక పూజలు, అర్చనలు జరిగాయి. శ్రీసాయి నక్షత్రమాలిక మండలి ఆధ్వర్యాన పారాయణం, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమాలను మందిర వ్యవస్థాపకుడు తంగెళ్లమూడి వీరమోహనరావు పర్యవేక్షించారు.

లలితా మాతా పాహిమాం..



వైభవంగా సాగుతున్న నగరోత్సవ సేవ

ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో దసరా మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. నాల్గవ రోజైన ఆదివారం శ్రీలలితాత్రిపుర సుందరీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలిరావడంతో ఉదయం నుంచే క్యూలైన్లలో భక్తుల రద్దీ నెలకొంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



నృత్య ప్రదర్శిస్తున్న చిన్నారులు



ఆకట్టుకున్న కేరళ డప్పు వాయిద్యాలు



కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు



హారతి తీసుకుంటున్న భక్తజనం



వీఐపీ ప్రొటోకాల్ దర్శనాలకు పోటెత్తిన భక్తులు